క్లుప్తంగా

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె రైతు వేదికలో బుధవారం రైతు బీమా దరఖాస్తులను ఏఈఓ ప్రీతిసుధ స్వీకరించారు. 2024–25 సంవత్సరం పాత రైతుల రెన్యూవల్‌తో పాటు కొత్త రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 30వరకు మాత్రమే రెన్యూవల్ చేసుకునేందుకు గడువు ఉందని రైతులు వెంటనే తమ దరఖాస్తులు ఏఈఓలకు అందించాలని సూచించారు.

గట్టు: మండలంలోని బోయలగూడెంలో రైతుబీమా దరఖాస్తులను ఏఈఓ స్వీకరించారు. రైతు వేదికలో బోయలగూడెం క్లస్టర్ పరిధిలో 96 మంది దరఖాస్తులు ఏఈఓకు అందజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



అయిజ: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శాంతినగర్ సీఐ టాటా బాబు అన్నారు. బుధవారం అయిజ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విజయభాస్కర్‌తో కలిసి పట్టణంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు లర్నింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆటోలో వెళ్లే వారిపట్ల మర్యాదగా ప్రవర్తించాలని, ఆటోలో కెపాసిటీకి మించి మనుషులను ఎక్కించుకోరాదని సూచనలు చేశారు.

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి

ధరూరు: సైబర్ నేరాలను అరికట్టడంలో భాగంగా బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని వైఎస్సార్ చౌరస్తాలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ అబ్దుల్ షుకూర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కొత్తకొత్త సాంకేతిక పరిజ్ఞానంతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. బ్యాంకుల పేరు చెప్పి ఓటీపీలు అడిగి మీ ఖాతాలను ఖాళీ చేస్తారన్నారు. ప్రస్తుతం రైతులకు రుణాల మాఫీపై జరుగుతున్న పరిణామాలను నేరగాళ్లు పసి గట్టి మోసం చేసే అవకాశం ఉందన్నారు.

ఎంపీఓగా బాధ్యతల స్వీకరణ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓగా పద్మావతి బదిలీ కావడంతో ఆమె స్థానంలో ఇటిక్యాల మండలం నుంచి తిరుపతన్న బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీపై వెళ్లిన ఎంపీఓ పద్మావతిని సిబ్బంది ఘనంగా సన్మానించారు.

ఎస్ఐగా అబ్దుల్ షుకూర్

ధరూరు: మండల ఎస్ఐగా అబ్దుల్‌షుకూర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ విజయ్‌కుమార్ లీవ్‌పై వెళ్లారు. గద్వాల క్రైంబ్రాంచ్‌లో పని చేస్తున్న అబ్దుల్ షుకూర్ ధరూరుకు వచ్చినట్లు తెలిపారు.

మద్యంబాబులపై కేసులు నమోదు

రాజోళి: బహిరంగంగా మద్యం తాగిన వారిపై పోలీసులు వరుసగా కేసులు నమోదు చేస్తున్నారు. మండల కేంద్రంలో మూడు రోజులుగా ఎస్ఐ జగదీష్ ఆధ్వర్యంలో బహిరంగంగా మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం బహిరంగంగా మద్యం తాగుతున్న వారి సమాచారం రావడంతో పోలీసులు గస్తీ నిర్వహించి వారిపై కేసులు నమోదు చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారు, జన సంచారం ఉన్న చోట, పొలాలకు వెళ్లే దారుల్లో మద్యం తాగి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

ప్రైవేట్ పాఠశాల బస్సుపై రాళ్ల దాడి

శాంతినగర్: ప్రైవేట్ పాఠశాల బస్సుపై యువకులు రాళ్లతో దాడి చేయడంతో అద్దాలు పగిలిన సంఘటన మద్దూరులో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. శాంతినగర్‌కు చెందిన ఎస్ఆర్‌హెచ్ఎస్ ప్రైవేట్ పాఠశాల బస్సుపై మద్దూరులోని కొందరు గుర్తు తెలియని యువకులు రాళ్లతో దాడికి పాల్పడ్డారు. సంఘటనలో బస్సు అద్దాలు పగిలాయి. విద్యార్థులకు ఎలాంటి హాని జరగలేదని గ్రామస్తులు పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో విద్యార్థి సంఘం నేతలు

గట్టు: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్‌కు పిలుపు నిచ్చిన నేపథ్యంలో ముందస్తుగా విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హాలీంపాషా, కార్యదర్శి శివకుమార్, గట్టు మండల అధ్యక్షుడు రామిరెడ్డిలను సాయంత్రం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.



ధరూరులో రాయచూరు రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



జూరాల డ్యాం రహదారిలో చింతరేవులలో మడుగులను తలపిస్తున్న రోడ్లు

మడుగులను తలపిస్తున్న రోడ్లు

- ముసురు వర్షాలతో అన్నీ ఇబ్బందులే
- వాహనదారులకు తప్పని ఇక్కట్లు
- ప్రమాదాల బారిన పడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

ధరూరు: వర్షాకాలం, ఆపై ఎడ తెరపి లేకుండా కురుస్తున్న ముసురు వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రోడ్లపై మోకాలి లోతు గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఎక్కడ గుంత ఉందో తెలియక తికమక పడుతున్నారు. ప్రధాన రోడ్లపై గుంతలను పూడ్చేందుకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఇటు పనులు సాగక, అటు ఇంటి నుంచి వెళ్లనీయక ఇబ్బందులు పడుతున్నారు. ఏ రోజుకారోజు పని చేసి జీవించే వారి పరిస్థితి దారుణంగా మారింది. పంట పొలాల్లో నీరు నిలవడం వల్ల నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. గద్వాల–రాయచూరు ప్రధాన రహదారిలో మండల కేంద్రమైన ధరూరులోని ఎరుకలి వీధి వద్ద మోకాలు లోతు గుంతలు ఏర్పడి పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. పాదచారులకు అడుగు తీసి అడుగు వేయిలేని పరిస్థితి నెలకొంది. ఇదే మార్గంలోనే జాంపల్లి గ్రామ శివారులో నెట్టెంపాడు ప్రధాన కాల్వ వద్ద ఏర్పడిన గుంతలు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. రాయచూరు నుంచి వచ్చే వాహనాలు ఏ మాత్రం ఆదమరిచినా కాల్వ వద్ద ప్రమాదం సంభవించనుంది. గద్వాల–నారాయణపేట, మక్తల్ వయా ప్రియ దర్శిని జూరాల ప్రాజెక్టు మీదుగా వెళ్లే వాహనదారులకు చింతరేవుల వద్ద నడిరోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలతో ప్రమాదం పొంచి ఉంది. జూరాల డ్యాం– నర్సన్‌దొడ్డి చౌరస్తా వరకు ఒక వైపు వేసిన సీసీ రోడ్డుతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. పూర్తి స్థాయిలో రోడ్డు నిర్మించాలని పీజేపీ అధికారులకు విన్నవిస్తు న్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్లపై ఆర్అండ్‌బీ, పీజేపీ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



జూరాల డ్యాం దారిలో చింతరేవులలో మడుగులను తలపిస్తున్న రోడ్లు



రాయచూర్ - జాంపల్లి శివారులో నెట్టెంపాడు ప్రధాన కాల్వ వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

సమాజంపై అవగాహన పెంచుకోవాలి



అలంపూర్‌లో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఎస్ఐ, భరోసా కేంద్రం బృందం సభ్యులు

అలంపూర్: విద్యార్థులు సమాజంపై అవగాహన పెంచుకోవాలని భరోసా సెంటర్ కో– ఆర్డినేటర్ శివాణి అన్నారు. అలంపూర్ పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో భరోసా సెంటర్‌లో కల్పిస్తున్న సేవలపై బాలికలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లైంగిక వేధింపులకు గురయ్యే బాలికలకు, మహిళలకు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రం ద్వారా కల్పిస్తున్న సదుపాయాలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భరోసా కేంద్రం బాధిత మహిళలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. పోక్సో చట్టం, వాటికి శిక్షలు, యుక్త వయసులో వచ్చే ఆకర్షణలు, చదువు ప్రాముఖ్యత, మొబైల్ ఉపయోగం వల్ల కలిగే నష్టా లు, మహిళా సాధికారత, వివాహానికి సరైన వయ స్సు, తల్లిదండ్రుల ప్రాముఖ్యత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం భరోసా పోస్టర్లను ఆవిష్కరించారు. బృందం సభ్యులు డీసీపీఓ నరసింహ, ఎంఈఓ అశోక్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు జాఫర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే చర్యలు



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్ఐ చంద్రకాంత్

మానవపాడు: శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ప్రవర్తిస్తే ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చంద్రకాంత్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్‌లో వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కారిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

గద్వాల అర్బన్: ఆపదలో ఉన్న వారిని రక్షించేందుకు రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని ఎంఏఎల్‌డీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెంపొందించడం, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడం, మానసిక ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. కళాశాల విద్యార్థులు 25 యూనిట్ల రక్తం దానం చేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ శ్రీపతినాయుడు, అధ్యాపకులు నర్సింహులు, మనోజ్‌కుమార్, నాగభూషణం, కళాశాల ఏఓ మక్బుల్ అహ్మద్ తదితరులు ఉన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు



కేక్‌కట్ చేస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కురువ విజయ్‌కుమార్

గద్వాల అర్బన్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కురువ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలిపిన ఘనత కేటీఆర్‌దే అన్నారు. కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీకి దిక్సూచి అన్నారు. అనంతరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, మక్బుల్, బీచుపల్లి, ప్రతాప్‌రెడ్డి, పరశురాములు ఉన్నారు.

ఆదిశిలా క్షేత్రంలో పూజలు

మల్దకల్: కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతునాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

అయిజ: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీఆర్ఎస్ నాయకురాలు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో చిన్న, రాజు, ఆనంద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గట్టు: కేటీఆర్ జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బస్టాండ్ ఆవరణలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు.

మౌలాలిసాబ్‌ను దర్శించుకున్న ఎమ్మెల్యే

మల్దకల్: మండలంలోని కుర్తిరావులచెర్వులో మౌలాలిసాబ్‌ను బుధవారం గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మౌలాలిసాబ్‌కు ప్రత్యేక ప్రార్థన చేసి మొక్కులు తీర్చుకున్నారు. కులమతాలకు అతీతంగా మౌలాలి సాబ్‌ను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు తిమ్మారెడ్డి, రాజారెడ్డి, నర్సింహారెడ్డి, అజయ్, నరేందర్, మధు, వెంకటన్న, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్య సలహాలు పాటించాలి

రాజోళి: గర్భిణులు, శిశువులకు క్రమం తప్పకుండా వైద్యుల సూచనల మేరకు టీకాలు అందించాలని టీబీ నోడల్ పర్సన్ జయప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం ఆయన సిబ్బందితో కలిసి రోగ నిరోధక టీకాలపై చర్చించారు. వైద్యులు సూచించిన మేరకు గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగితే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారనే విషయం చెప్పాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ రంజిత్ కుమార్, ఏఎన్ఎం మద్దమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయండి

అయిజ: రాష్ట్ర ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వినోదనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో సత్తాను చాటుదాం

గట్టు: బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని, దీనికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని బీజేపీ నాయకుడు బల్గెర శివారెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గూడురు నాగప్ప, సురేష్, సంజీవనాయుడు, వీరశేఖర్‌గౌడ్, వెంకటేష్, నాగరాజుశెట్టి, నర్సింహాగౌడు పాల్గొన్నారు.

మొక్కల లక్ష్యం పూర్తి చేయాలి

మానవపాడు: మండల వ్యాప్తంగా మొక్కల పెంపకంలో లక్ష్యం పూర్తి చేయాలని ఎంపీడీఓ రమణారావు సూచించారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్‌అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 51,200 మొక్కలు నాటాలని సిబ్బందికి సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ విజయ్‌శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్ పోస్టర్ల విడుదల

గట్టు: ఫొటోఎగ్జిబిషన్‌కు సంబంధించిన పోస్టర్లను ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల ఆధ్వర్యంలో బుధవారం ఎస్ఐ మల్లేష్ మండల కేంద్రంలో విడుదల చేశారు. హైదరాబాదులో ఈ నెల 26, 27, 28 తేదీల్లో ఫొటో ఎగ్జిబిషన్ ఉందని తెలిపారు.కార్యక్రమంలో ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు నర్సింహ, ఉపాధ్యక్షుడు వెంకటేష్, వీరేష్, సంఘం సభ్యులు సుధీర్, వీరేష్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు

మల్దకల్: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ కాంతమ్మ అధికారులను ఆదేశించారు. బుధవారం మల్దకల్ ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించి అధికారులతో మాట్లాడుతూ.. సమయపాలన పాటించడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం, కస్తూర్బా బాలికల పాఠశాలను సందర్శించారు. అధికారులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామాల్లో లక్ష్యం మేరకు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలలో మొక్కలను పెంచుతూ గ్రామాల్లో పచ్చదనం వెల్లివిరిసేలా చూడాలన్నారు.



మల్దకల్‌లో మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ కాంతమ్మ, అధికారులు

నాటిన మొక్కలకు ట్రీ గార్డులు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని సంరక్షించాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో పారిశుద్ధ్య, తాగునీటి, విద్యుత్ తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కలునాటి పర్యావరణం కాపాడుకుందాం

శాంతినగర్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని డీఆర్‌డీఓ, అదనపు కలెక్టర్ నర్సింగరావు పిలుపునిచ్చారు. వన మహోత్సవంలో భాగంగా వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని తనగల, జూలెకల్ గ్రామాల్లో, అలంపూర్–రాయచూర్ రహదారి వెంట డీఆర్‌డీఓ బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ఈ సమయంలో నాటితే మొక్కలు బాగా అతుక్కుంటాయన్నారు. అధికారులందరు స్పందించి ప్రభుత్వ స్థలాలు, రోడ్లవెంట విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. వడ్డేపల్లి పట్టణ పరిధిలోని 9వ వార్డులోని పల్లెదవాఖానను పరిశీలించారు. అనంతరం వడ్డేపల్లిలోని ప్రకృతి వనం, కేజీబీవీ పాఠశాలల ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. గతంలో వేసిన మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



జూలెకల్‌లో మొక్కలు నాటుతున్న జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ నర్సింగరావు

షీ టీం సేవలపై అవగాహన



మాచర్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

గట్టు: బాలికలు, మహిళలకు అండగా షీ టీం ఉన్నట్లు షీ టీం సభ్యులు తెలిపారు. బుధవారం గట్టు గురుకుల, మాచర్ల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు షీ టీం సేవలపై అవగాహన కల్పించారు. షీ టీం సభ్యులు మాట్లాడుతూ పోకిరీలు అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, మాట్లాడినా, బెదిరించినా వారి వివరాలను షీ టీం సభ్యులకు తెలపాలన్నారు. ఫిర్యాదు చేసే వారి వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు. 18ఏళ్లు నిండని అమ్మాయిలకు పెళ్లిళ్లు ఎక్కడ జరిగినా చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, డయల్ 100కు కాల్ చేయాలన్నారు. మహిళలపై చిన్నారులపై జరుగుతున్న నేరాలు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, మహిళల రక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఎదురయ్యే ఇబ్బందులపై 8712670312కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మల్దకల్: మండలంలోని ఉలిగేపల్లి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. బుధవారం ప్రార్థన సమయానికి ఉపాధ్యాయులు ఎవరు పాఠశాలకు రాకపోవడంతో పాఠశాల విద్యార్థులే పాఠశాల ఆవరణలో శుభ్రం చేసి ప్రార్థన నిర్వహించారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులు సమయ పాలన పాటించేలా విద్యాశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ఉలిగేపల్లి పాఠశాలలో చీపుర్లతో ఊడ్చుతున్న విద్యార్థులు

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలి

గద్వాల అర్బన్: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని లైఫ్ చేంజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరశురాముడు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో బుర్దపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో లైఫ్‌చేంజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రాఫ్ నోట్ బుక్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జ్యోత్స్న, లైఫ్‌చేంజ్ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న లైఫ్ చేంజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరశురాముడు

ముమ్మరంగా సభ్యత్వ నమోదు

అయిజ: పీఆర్‌టీయూ టీఎస్ సంఘం సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు ముమ్మరంగా చేపట్టారు. బుధవారం మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీలో సభ్యత్వం చేయించారు. మండలంలోని ఉత్తనూరు ప్రాథమిక పాఠశాలలో మేడికొండలోని ప్రాథమిక పాఠశాల, పీఆర్‌టీయూ స్టేట్ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వం నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శివ శంకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు తిమ్మారెడ్డి, మండల అధ్యక్షుడు రవి, ప్రధాన కార్యదర్శి నాగరాజు, గోవిందు పాల్గొన్నారు.



కేజీబీవీలో సభ్యత్వం చేయిస్తున్న పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు

కాలనీల్లో నెమలి



అయిజ: పట్టణంలో బుధవారం నెమలి సంచరించింది. పంట పొలాల నుంచి పట్టణంలోకి వచ్చిన నెమలి వివిధ కాలనీల్లో తిరుగుతూ చూపరులను ఆకట్టుకుంది. నెమలిని చూసిన పిల్లలు కేరింతలు కొడుతూ దాన్ని వెంట పరిగెత్తడంతో ఇంటి మిద్దెలపై కూర్చొని కనువిందు చేసింది. పిల్లలు ఆటపట్టించడంతో ఎగిరిపోయి కనిపించకుండా పోయింది.